


'సోమశిల'కు 2,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,800 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.887 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు : సాయిబాబా ఆలయంలో భక్తులు



నెల్లూరు : రాజరాజేశ్వరిని దర్శించుకుంటున్న భక్తజనం



బుచ్చిరెడ్డిపాళెం : పెద్ద వెండినందిపై ఆదిదంపతులు



రాపూరు : పెంచలకోనలో స్వామి దర్శనార్థం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

నూతనోత్సాహం!

- ఆంగ్ల సంవత్సరాదికి ఘనస్వాగతం
- ఉత్సాహంగా యువత కేరింతలు
- కిటకిటలాడిన ప్రార్థనా మందిరాలు

నూతన సంవత్సరాది వేడుకలు అంబరాన్ని తాకాయి. మంగళవారం అర్ధరాత్రి తర్వాత 2025కు స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్చి, కేకులు కట్ చేశారు. అనంతరం కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగర, పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో యువత కేరింతలు కొడుతూ 'హ్యాపీ న్యూయర్' అంటూ ఒకరినొకరు ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఉదయాన్నే దైవదర్శనాల కోసం ఆలయాలు, చర్చిల వద్దకు బారులు తీరారు. వచ్చే రద్దీకి అనుగుణంగా ఆలయాల నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు జరిగాయి.





రాపూరు : పెంచలకోనలో విశేష అలంకరణలో పెంచలస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాది వేడుకలు బుధవారం అంబరాన్ని అంటాయి. అర్ధరాత్రి తర్వాత కేరింతలతో 'హ్యాపీ న్యూయర్' అంటూ 2025ను ఘనంగా స్వాగతించారు. తెల్లవారుజాము నుంచే జిల్లావ్యాప్తంగా అన్ని దేవాయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దైవ నామస్మరణలతో ఆ పరిసరాలు మారుమోగాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాలకొండ,



నెల్లూరు : వైకుంఠనాథుడిగా దేవేరులతో రంగనాథుడు

పెంచలకోన, వేదగిరి నరసింహకొండ, జొన్నవాడ కామాక్షితాయి, వెంగమాంబ పేరంటాలు, కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆత్మకూరు, కావలి, కందుకూరు, కోవూరు నియోజకవర్గాలలో ప్రసిద్ధి చెందిన ఆలయాలు, గ్రామ దేవతలను ప్రజలు తరలివెళ్లి దర్శించుకున్నారు. ఇక చర్చిలో క్రైస్తవులు ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి, కేకులు, స్వీట్లు పంచుకొన్నారు. ముస్లింలు కూడా దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రధాన ప్రార్థనలు చేశారు.

- నెల్లూరులోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష పూలంగిసేవ జరిగింది. ఈ వేడుకను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం, సాయంత్రం విశేషపూజలు జరిగాయి. జిల్లా న్యాయాధికారి యామిని, ఇతర న్యాయాధికారులు దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు, ఆలయ మర్యాదలు అందుకున్నారు. జిల్లా సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనర్ధాన్‌రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అలాగే, తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు. మూలస్థానేశ్వరాలయం, శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేట రామాలయం, కోదండరామపురం మహాలక్ష్మి ఆలయం, అయ్యప్పగుడి తదితర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.
- గాంధీబొమ్మ సెంటర్ షిరిడీ సాయిబాబా మందిరం, బాలాజీనగర్ సాయిదర్బార్, చిల్డ్రన్స్‌పార్కు సాయిసదన్‌లో ప్రత్యేక పూలంగిసేవ అలంకారం జరిగాయి. భక్తులు బారులుతీరి సాయిబాబాను దర్శించుకున్నారు. ఇక నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని రకాల వ్యాపారాలు జోరుగా జరిగాయి. హోటళ్లు, వస్త్ర, బంగారం, ఆటోమొబైల్స్, మొబైల్స్ దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాలో పేదలకు అన్నదానాలు, దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమాలు కూడా జోరుగా సాగాయి.





● పోలీసుల ప్రత్యేక డ్రైవ్

నెల్లూరు (క్రైం) : నూతన సంత్సర వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు నిరోధించేందుకు ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి జిల్లావ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ న్విహించారు. నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, బుచ్చి, ముత్తుకూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. 198 పికెట్స్, 60 స్పెషల్ మొబైల్ పార్టీలతో అన్ని కూడళ్లు, హైవే ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపట్టారు.



నెల్లూరు : అర్ధరాత్రి తర్వాత రోడ్లపైకి చేరిన యువత

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి అందరూ పూజలు చేయండి : ఆనం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి ప్రధాని మోదీతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఆయన కృషి సఫలీకృతం కావడం కోసం ప్రజలందరూ పూజలు చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కుటుంబసభ్యులతో కలిసి ఆయన రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ యువత ఉద్యోగ సాధన మాత్రమే కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థితికి ఎదిగేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వివిధ రంగాల పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రామాయపట్నంలో బీపీసీఎల్ ఆధ్వర్యంలో భారీ రిఫైనరీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని చెప్పారు. ఆ పోర్టు పరిధిలో వివిధ రకాల అనుబంధ పరిశ్రమలతో జిల్లా రూపురేఖలే మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ గౌరవార్థం సంతాపదినాలు ప్రకటించడంతో నూతన సంవత్సరానికి ఆడంబరంగా జరుపుకోకపోయినా ప్రజలందరూ ఈ కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ముగ్గురమ్మల వైభోగం



గ్రామోత్సవంలో గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ

అల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులో గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మల గ్రామోత్సవాలు కనులపండువగా సాగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉత్సవవర్లను ప్రత్యేక పూలాలంకరణలో ఊరేగించారు. ఈ సందర్భంగా గంగమ్మ ముందు గంగపెట్టెను తీసుకొని యాదవులు వీరతాళ్లను వేశారు. అడుగడుగునా భక్తులు అమ్మవార్ల రథాలకు ముందు ముగ్గులను వేసి ఆహ్వానం పలికారు. గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో అమ్మవార్లకు దిష్టితీశారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తప్పెట్లు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, డిజే సౌండ్స్, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కార్యక్రమాలను నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కాగా, ఎన్నడూలేని విధంగా ముగ్గురు అమ్మవార్ల ఆలయాల ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిశాయి. ఏటా భక్తజనం అత్యధికమై భక్తుల కరతాళ ధ్వనుల మధ్య అమ్మవార్లను గ్రామోత్సవానికి తరలించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, పెన్నార్ డెల్టా ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అమ్మవార్లను దర్శించుకున్నారు.



గంగపెట్టెతో యాదవరాజులు

4 నుంచి ఎన్‌వైకే క్రీడా పోటీలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో ఈనెల 4వతేదీ నుంచి బ్లాక్ లెవల్ క్రీడాపోటీలు నిర్వహి స్తున్నట్లు ఎన్‌వైకే అధికారి మహేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు, కందుకూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. నెల్లూరు డివిజన్‌కు సంబంధించి 4వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో, కం దుకూరు డివిజన్‌కు 6వ తేదీన స్థానిక డీఆర్ఆర్ కళాశాలలో పోటీలు నిర్వహి స్తామ న్నారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, ఖోఖో అంశాల్లో జరిగే పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాల వయసు కలిగిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కావలి సబ్ రిజిస్ట్రార్‌గా రాధాకృష్ణమూర్తి

- నెల్లూరుకు సుమలతారెడ్డి బదిలీ
- హాట్‌టాపిక్‌గా మారిన వివాదానికి తెరపడినట్టేనా!?



కావలి,జనవరి1(ఆంధ్రజ్యోతి): కావలి రిజిస్ట్రార్‌గా రాధాకృష్ణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆ పోస్ట్‌పై నెలకొన్న వివాదానికి తెరపడినట్టు అయ్యింది. సార్వత్రిక ఎన్నికలు అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా సుమలతా రెడ్డి కావలికి బదిలీపై వచ్చారు. అయితే ఎమ్మెల్యే సిఫారసు లేకుండానే ఆమె ఉన్న తస్థాయిలో తన పలుకుబడిని ఉపయోగించి వచ్చారనే ప్రచారం నడిచింది. దీనికితోడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి ఆమెకు మధ్య సఖ్యత కుదరలేదు. అలాగే సుమలతారెడ్డి ప్రవర్తనపై ప్రజల్లో కూడా వ్యతిరేకత రావడం, మామూళ్ల కోసం ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నిటినీ ఆసరాగా తీసు కుని సుమలతారెడ్డిపై ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమె నెల రోజులపాటు సెలవుపై వెళ్లగా సూపరింటిండెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇక ఆమె రారనుకుం టున్న తరుణంటా ఇటీవల సుమలతా రెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరిం చారు. అయితే అనూహ్యంగా కార్యాలయంలో ఎవరికీ మామూళ్లు ఇవ్వాల్సిన పనిలేదని బోర్డు పెట్టి మళ్లీ ఐదు రోజులు సెలవు పెట్టారు. దీనిపై కార్యాలయ సిబ్బంది మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సుమలతారెడ్డిని నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటకు డిప్యుటేషన్‌పై బదిలీ చేసి, అక్కడున్న రాధాక్రిష్ణమూర్తిని కావలికి పంపారు. కానీ, ఈ ఉత్తర్వులు కూడా అమలులోకి రాకుండా కొన్ని రోజులపాటు కాలయాపన చేశారు. ఎట్టకేలకు బుధవారం బదిలీపై ఆమె వెళుతోందని తెలిసిన సిబ్బంది మంగళవారం సాయంత్రమే కార్యాలయంలో ఉన్న బోర్డును తొలగించారు.

ఒక్కటంటే ఒక్కటీ లేదు!

- ప్రీమియం లిక్కర్ స్టోర్‌లకు ఆదరణ కరవు
- ఒక్క దరఖాస్తు వేయని వ్యాపారులు
- 7వ తేదీ వరకు గడువు పెంపు

నెల్లూరు (క్రైం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేయనున్న ప్రీమియం లిక్కర్ స్టోర్‌లకు వ్యాపారుల నుంచి ఆదరణ కరువయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 12 స్టోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఒక స్టోర్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. గత నెల 31వ తేదీ వరకు గడువు విధించి ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. అయితే, ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 7వ తేదీ వరకు గడువును పొడిగించారు.

● 'ఎలైట్' షాపుల్లా..

వైసీపీ హయాంలో మద్యం దుకాణాలతోపాటు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎలైట్ దుకాణాలు ఏర్పాటు చేశారు. మందు బాబులే దుకాణాల లోపలికి వెళ్లి నచ్చిన బ్రాండ్‌ను కొనుగోలు చేసేవారు. అదేవిధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ప్రైవేటు వైన్ షాపులతో పాటు ప్రీమియం లిక్కర్ స్టోర్స్‌ను తక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. నెల్లూరులో ఏర్పాటు చేసే స్టోర్‌ను పొందాలనుకునే వ్యాపారులు దరఖాస్తుతో పాటు రూ15 లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. స్టోర్ లైసెన్సు కాలపరిమితి ఐదేళ్లు. ప్రతి సంవత్సరం ఫీజు రూపేణా రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది. 4వేల చదరపు అడుగులలో స్టోర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.400పైగా ఎమ్మార్పీ ఉండే అన్ని రకాల మద్యం బ్రాండ్లను ఇక్కడ విక్రయిస్తారు. మద్యంతో పాటు గ్లాస్‌లు, ఓపెనెర్ వంటి సామగ్రిని కూడా అమ్ముకోవచ్చు.

గడువు పొడిగించాం

నెల్లూరులో ప్రీమియర్ లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ గడువును 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వం పొడగించింది. ఆసక్తి గల వారు apsbcl.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖా స్తులను డౌన్‌లోడ్ చేసుకొని, నాన్‌రీఫండ్ రుసుము రూ.15 లక్షలకు డీడీ తీసుకోవాలి. నిర్ణీత గడువులోపు దరఖాస్తును సమర్పించాలి. పూర్తి వివరాలు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలి.

- శ్రీనివాసులు నాయుడు, ఎక్సైజ్ అధికారి

నచ్చినట్టు వస్తామంటే కుదరదు!

- ప్రభుత్వ కార్యాలయాలపై ప్రభుత్వం దృష్టి
- ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు
- ప్రతి కార్యాలయంలో బయోమెట్రిక్ యంత్రం
- త్వరలో అమలుకు నిర్ణయం తీసుకునే అవకాశం
- వివరాలు పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు



నెల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ఎప్పుడు కార్యాలయానికి వస్తారో తెలియదు. వచ్చినా.. ఎప్పటికి వరకు ఉంటారో కూడా అర్థంకాని పరిస్థితి. సాధారణ పాలనలో ఇది ఇబ్బందికరంగా మారింది. చిన్న పనులకు కూడా ప్రజలు పలుమార్లు తిరగాల్సి వస్తోంది. నిర్ణీత పనివేళల్లో కార్యాలయాల్లో ఉండాలని ప్రభుత్వం అనేక మార్లు ఉత్తర్వులు జారీ చేసినా అమలులో సాధ్యపడటం లేదు. ఈ క్రమంలోనే వేలి ముద్ర, ముఖ హాజరు వంటి అనేక ప్రయోగాలు చేసినా ఫలితాలు ఇవ్వలేదు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో బాధ్యత పెంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేసేందుకు ప్రయత్నిస్తు న్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన కీలక ఉత్తర్వులు తాజాగా ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు అందాయి. ప్రస్తుతం జిల్లాలో ఏ ఏ కార్యాలయాలు ఉన్నాయి? వాటిల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నాయా!? ఉన్నా ఎన్ని పని చేస్తున్నాయి!? ఆ యంత్రాల నిర్వహణ ఎవరు చూస్తున్నారు..? వంటి వివరాలు త్వరగా పంపాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది. దీంతో కలెక్టర్.. అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసి వెంటనే వివరాలు అందజేయాలని సూచించారు. ఆ వివరాల ఆధారంగా అవసరం మేరకు కొత్త బయోమెట్రిక్ యంత్రాలను జిల్లాకు పంపే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేసే అవకాశం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.

● ఇప్పటికే సచివాలయాల్లో అమలు

పాలనలో బాధ్యత పెంచే పనిలో భాగంగా సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేశారు. ఇకపై ఉదయం పది గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు బయో మెట్రిక్ వేయాల్సి ఉంది. ఒకపూట వేస్తే దానిని ఆబ్సెంట్‌గా పరిగణిస్తారు. ఇప్పటి వరకూ సచివాలయాల్లో ఉద్యోగులు ఎప్పుడు వస్తున్నారు.. ఎప్పుడు వెళుతున్నారో.. తెలిసేది కాదు. కొందరు కార్యాలయానికి రాకుండానే క్యాంపుల పేరుతో బయట తిరుగుతుండేవారు. ప్రజలకు ఇది తీవ్ర అసౌకర్యంగా ఉండేది. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారులు పరిశీలనకు వెళ్లినప్పుడు సచివాలయ సిబ్బంది ముందు గానే ఇళ్లకు వెళ్లిపోతుండటం వెలుగు చూసింది. అయితే ఇప్పుడు బయోమెట్రిక్ హాజరును తప్ప నిసరి చేసి జీతానికి అటాచ్ చేయడంతో చాలా వరకూ మార్పు వచ్చి నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇదే విధానం అన్ని శాఖల్లోనూ ప్రారంభమైతే అక్కడా బాధ్యత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాగా జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌ను దీనిపై వివరణ కోరగా ఏపీ ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నాయి.. అందులో ఎన్ని పనిచేస్తున్నాయి.. అన్న వివరాలు పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు పేర్కొన్నారు.

ఆహారం కోసం ఆరాటం!



ఏందబ్బా..
ఎవరూ పట్టించుకోలేదే!



ఇక్కడ వద్దులే..
మరో చోటకు వెళదాం..

ఆహారం కోసం ఓ వానరం ఆరాటమిది. ఉదయగిరి మండలం గండిపాళెం లోని శివాలయం వద్ద భక్తులు వేసే ఆహారం కోసం ఆశగా ఎదురు చూసింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో కాస్త ముం దుకు అడుగులు వేసింది. స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టిన వెంటనే అక్కడకు పరుగులు తీసి ఓ చిప్పను లాక్కొని చెట్టుపైకెక్కి ఆరగించింది. ఇంతలో భక్తులు కేకలు వేయడంతో ఆ చిప్పను అక్కడే వదిలేసి క్రస్ట్‌గేట్లపైకి పరుగులు తీసింది హమ్మయ్యా... తప్పించు కొన్నానంటూ ఊపిరి పీల్చుకొంది. ఆ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

\- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



ఈ కొబ్బరి చిప్పతో నా ఆకలి తీర్చు కుంటా!



హమ్మయ్యా.. తప్పించు కున్నానులే!

కాళీయ ఫణి.. ఫణి!

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : మూలాపేటలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బుధవారం భక్తులకు కాళీయ మర్దనుడి అలంకరణలో దర్శనమి చ్చారు. అలాగే, తల్పగిరి రంగనాథస్వామి వైకుంఠనాధునిగా భక్తులను అనుగ్రహిం చారు. ఆ రెండు ఆలయాల్లో అధ్యయనో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం గోదాదేవికి ధనుర్మాస పూజలు జరిగాయి. ఆళ్వారు గోష్ఠి, దివ్యనాలాయిర ప్రబంధ గోష్ఠిగానం, ప్రాకారోత్సవం నిర్వహించారు.



రేపు జాబ్‌మేళా

వెంకటాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వీసీ సారంగం విజయభాస్కర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరై ఇంట ర్వ్యూలు నిర్వహించి, ఉద్యో గాలు కల్పించనున్నాయ న్నారు. పది, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వి ని యోగం చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జిల్లాలో బుధవారం జరిగిన నాలుగు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు.



ముళ్ల పొదల్లోకి దూసుకుపోయిన లారీ

సంగం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మినీ ట్రక్ వ్యాన్, లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా ముగ్గురికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై దువ్వూరు శ్మశానం ఎదురుగా జరిగింది. వివరాల మేరకు.. బద్వేల్ నుంచి మినీ ట్రక్ వ్యానులో కూరగాయలు వేసుకుని నెల్లూరు మార్కెట్‌లో అన్‌లోడు చేసి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో దువ్వూరు శ్మశానం వద్ద ఎదురుగా వస్తున్న లారీ అదుపు తప్పి కుడివైపు దూసుకువచ్చి మినీ ట్రక్ వ్యానును ఢీకొంది. దీంతో వాహనాల క్యాబిన్‌లు నుజ్జునుజ్జయ్యాయి. లారీ డ్రైవర్ రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మినీ ట్రక్ వ్యాన్ డ్రైవర్ దస్తగిరి క్యాబిన్‌లో ఇరుకుపోయాడు. దువ్వూరు గ్రామానికి చెందిన యువకులు వెంటనే స్పందించి క్యాబిన్‌లో ఇరుక్కున డ్రైవర్ దస్తగిరిని అతికష్టం మీద బయటకు తీసి బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించగా కొంతసేపటికే మృతిచెందాడు. వీరితోపాటు మినీ ట్రక్ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న శేఖర్, నర్సింగప్పకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మొదట బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కారు ఢీకొని..



ప్రమాదంలో మృతి చెందిన వెంగయ్య

దుత్తలూరు (ఉదయగిరి) : కారు, బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన దుత్తలూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నర్రవాడ గ్రామానికి చెందిన సవరం వెంగయ్య (55) పని నిమిత్తం దుత్తలూరుకు వచ్చి తిరిగి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోలుబంకులోకి వెళ్లి వాహనానికి ఆయిల్ నింపుకున్నాడు. అక్కడ నుంచి తిరిగి నర్రవాడకు వెళ్లే క్రమంలో నాగార్జునసాగర్ నుంచి సోమశిలకు వెళుతున్న కారు అతన్ని ఢీకొంది. దీంతో వెంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాల నమోదు చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

● సీతారామపురం : బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన నారాయణంపేట గ్రామ సమీపంలో బుధ వారం వేకువజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే వరికుంట పాడు గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన మన్నెం శ్రీను (60) నారాయణంపేట గ్రామ సమీపంలోని పొలంలో పనిచేస్తున్న తన బంధువైన రోశయ్యను చూడడానికి వస్తూ నారాయణం పేట మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మన్నెం శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● అనంతసాగరం : స్థానిక చెరువు కట్ట సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుబైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అనంతసాగరం ఎస్సీ కాలనీకి చెందిన పీ పెంచలయ్య సోమశిల వైపు వెళ్తుండగా సోమశిల నుంచి అనంతసాగరం వస్తున్న మరో బైక్ ఢీకొన్నాయి. దీంతో పెంచల య్యకు తీవ్రగాయం కాగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో అతన్ని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో బుధవారం ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్కుడు మృతి చెందాడని, మృతదేహంపై బ్లూ కలర్ జెర్సీ, బ్లూ కలర్ ప్యాంట్ ఉన్నాయని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలిలో వివాహిత దారుణహత్య

● చేరదీసినవాడే చంపేశాడు..

కావలి రూరల్, జనవరి1(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి దాటే వరకూ ఆనందంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అంతలోనే వారి మధ్యే ఉన్న ఓ కామాంధుడు ఆ ఇంటి ఇల్లాలు అర్పితా బిశ్వాస్ (24)పై కన్నేసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన బుధవారం కావలిలోని గాయత్రీనగర్ శివార్లలో చోటుచేసుకుంది. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు, పశ్చిమ బంగాల్‌లోని శంకర్‌పూర్ జిల్లా గోపాల్ నగర్ మండలం నార్తుపీజీ ఎస్ ప్రాంతానికి చెందిన కొమరేష్ చంద్ర బిశ్వాస్, ఆయన భార్య అర్చన బిశ్వాస్ చాంద్‌నీలు 30 ఏళ్ల క్రితం నెల్లూరుకు వచ్చి మొలలకు వైద్యం చేసే వారు. అక్కడ నుంచి పదేళ్ల క్రితం కావలికి వచ్చి చాంద్‌నీ క్లీనిక్ పేరుతో మొలలకు వైద్యం చేసేవారు. గాయత్రీనగర్ శివారులో సొంత ఇంటిని నిర్మించుకుని కుమారుడు శ్రీకాంత్ బిశ్వాస్ కలిసి ఉంటున్నారు. అందరితో కలివిడిగా ఉండే వీరు తమ సమీప బంధువైన నయాన్(21)ను చేరదీశారు. క్లీనిక్‌లో కాంపౌండర్‌గా ఉంచుకుని వైద్యం నేర్పించసాగారు. కాగా, శ్రీకాంత్ బిశ్వాస్ తల్లిదండ్రులు ఆదివారం తిరుపతికి వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న ఆయన భార్య అర్పితా బిశ్వాస్, ఇద్దరు కుమార్తెలు, అల్లూరు మండలం ఇందుకూరుపేట నుంచి వచ్చిన శ్రీకాంత్ బిశ్వాస్ సోదరుడు మహానంద్ సర్కార్, కాంపౌండర్ నయాన్ మంగళవారం అర్ధరాత్రి వరకు ఇంటి వద్దే ఆంగ్ల సంవత్సర వేడుకలు నిర్వహించారు. శ్రీకాంత్ బిశ్వాస్, పెద్దకుమార్తె (5), సోదరుడు మహానంద్ సర్కార్‌తో కలసి ఒక బెడ్ రూంలో పడుకున్నారు. అర్పితా బిశ్వాస్, చిన్న కుమార్తె(6నెలలు)తో కలసి మరో బెడ్‌రూంలో పడుకున్నారు. నయాన్ మాత్రం హాలులో పడుకున్నాడు. అర్పితా బిశ్వాస్‌పై కన్నేసిన నయాన్ బుధవారం తెల్లవారుజామున ఆమె నిద్రిస్తున్న బెడ్ రూం తలుపు తీయటంతో ఆ అలికిడికి ఆమె లేసి, కేకలు వేస్తుందన్న భయంతో తన వెంట తెచ్చుకున్న రాడ్‌తో తలపై మోదాడు. తీవ్రగాయాలతో పడిపోయిన



అర్పితా బిశ్వాస్ (ఫైల్)

ఆమెను ఇంటి నుంచి 100 మీటర్ల దూరంలోని పొలాలకు తీసుకువెళ్లి పంట కాలువలో పడేసి వెళ్లిపోయాడు. ఉదయం 6 గంటల సమయంలో నిద్రలేసిన శ్రీకాంత్ బిశ్వాస్ భార్య కనిపించకపోవటం, ఇంట్లో రక్తపు మరకలు ఉండటం, నయాన్ కూడా కనిపించక పోవటంతో ఇంటి పరిసరాల్లో గాలించారు. అర్పితా బిశ్వాస్ తలకు తీవ్రగాయాలతో ఒంటిపై దుస్తులు లేకుండా విగతజీవిగా పడిఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గతంలో నయాన్ ప్రవర్తన సరి లేదని మృతురాలు తన భర్తకు చెప్పి ఉండటం, నయా న్ కనిపించ కుండా పోవటంతో అర్పితను చంపి అత్యాచారం చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. తల్లి మృతి చెందిందన్న విషయం తెలియని చిన్నారుల రోదనలు చూపరులను కలచివేశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడిని అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. తిరుపతికి వెళ్లిన శ్రీకాంత్ బిశ్వాస్ తల్లిదండ్రులు బుధవారం ఉదయం ఇంటికి చేరుకునేటప్పటికి ఈ ఘటన జరిగి ఉంది.

డీఆర్‌పీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ, సీడాప్, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల కింద జిల్లా రిసోర్సు పర్సన్(డీఆర్‌పీ) ఎంపిక కోసం నిరుద్యోగ పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఓ ప్రకటనలో కోరారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం నోడల్ ఏజెన్సీ అయిన ఏపీఎఫ్‌పీఎస్ ద్వారా డీఆర్‌పీఎస్‌ల నియాకం ఉంటుందని, వారికి నెలవారీ జీతం ఉండదని, ఇన్సెంటివ్స్ ఆధారంగా నియమిస్తారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమిస్తారని తెలిపారు. వీరు పారిశ్రామికవేత్తలను గుర్తించటం పీఎంఎఫ్ ఎంఈ పథకాన్ని వివరించటం, సరైన ఆహార ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్ ఆలోచనలను సూచించటం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకో వాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువు పెంపు

నెల్లూరు(విద్య) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు డీఈవో బాలాజీ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వతేదీలోపు ఎలాంటి ఆలస్య రుసుములు లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. ఆ తర్వాత 8వతేదీ వరకు రూ.25, 9వతేదీ రూ.50 అపరాధ రుసుము, 10వతేదీ ఒక్క రోజు తత్కాల్ రుసుముతో ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా ఆగని కబ్జా

అనంతసాగరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మ వరం చెరువు పరిధిలోని సర్వే నెంబరు 217లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొం దరు ఆక్ర మించారు. ఈమేరకు ఈవిషయంపై స్థానికులు రెవెన్యూ, ఇరిగేషన్ అదికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఇటీవల ఆభూమి ప్రభుత్వ భూమిగా గుర్తించి అందులో వ్యవసాయ పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డు పెట్టారు. అయినా ఏమాత్రం లెక్క చేయక బుధవారం బోర్డు పెట్టిన భూమిలో ట్రాక్టర్‌తో దున్నారు. ఈవిషయంపై స్థానికులు మరల తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.



ప్రభుత్వ భూమిలో దున్నుతున్న ట్రాక్టరు

కోనకు పోటెత్తిన భక్తజనం



శ్రీవారి ఆలయం ముందు ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పెంచల స్వామి నామస్మరణలతో పెంచలకోన క్షేత్రం మారు మోగింది. కొత్త సంవత్సరం వేళ తమ ఇష్టదైవాన్ని కనులారా దర్శనం చేసుకునేందుకు నెల్లూరు నుంచేగాక తిరుపతి, కడప జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం తెల్లవారు జాము నుంచే క్యూ లైన్లలో బారులుతీరి స్వామివారు, అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరగాయి. భక్తుల సౌక ర్యార్థం గుడి ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే బుధవారం ఒక్కరోజే ప్రత్యేక దర్శనాలు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12.08 లక్షలు, నిత్యాన్న దానానికి రూ.1.78 లక్షల విరాళాలు వచ్చినట్లు తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. అలాగే మండలంలో తూమాయి వద్ద ఉన్న అంకయ్య కొండ గుడి వద్ద భక్తుల రద్దీ నెల కొంది. ఆలయ ధర్మకర్త పాపకన్ను వేణుగోపాల్ రెడ్డి నూతన సంవత్సరం క్యాలెండరును ఆవిష్కరించారు.

పాటూరు-గుమ్మళ్లదిబ్బలో చేనేత క్లస్టర్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం ఆరంభరోజే కేంద్ర ప్రభుత్వం పాటూరు చేనేతలకు తీపి కబురు అందింది. కోవూరు నియోజకవర్గంలోని పాటూరు-గుమ్మళ్ల దిబ్బలో చేనేత కస్టర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపి, రూ.76.32లక్షలను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో స్థానికంగా ఉన్న 175 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. గుమ్మళ్లదిబ్బలో ఎస్‌సీడీపీలో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఇటీవల కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరారు. ఈ మేరకు క్లస్టర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ క్లస్టర్ ద్వారా చేనేతలకు మగ్గం సామగ్రి అందించటం తోపాటు వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న డిజైన్లపై శిక్షణ ఇస్తారు. ఎవరైనా చేనేతకు సొంత స్థలం వుండి గది ఏర్పాటు చేయాలని భావిస్తే అందుకు తగ్గ నిదులు సమకూరుస్తారు. ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి విలువ ఉండేలా కృషి చేస్తారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7344
వెండి కిలో ధర	రూ. 89,600
వెండి ఒక గ్రాము	రూ.92.60

మాచవరంలో కలకలం రేపిన
ఫ్లెక్సీల చింపివేత


మాచవరంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఇంటూరి ఫ్లెక్సీలను బ్లేడుతో కోసిన గుర్తుతెలియని వ్యక్తులు

కందుకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరంలో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీ చించివేత కలకలం సృష్టించింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఆ గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. దీంతో మూడురోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆఫ్లెక్సీలను చించివేయగా మంగళవారం తిరిగి ఏర్పాటుచేశారు. అయితే రాత్రికి వాటిని కూడా బ్లేడులు పెట్టి కోసేయటంతో కలకలం రేగింది. మాజీమంత్రి మానుగుంట మహీధర రెడ్డి స్వగ్రామమైన మాచవరంలో గతంలో ఆయన ఉన్న పార్టీకి మినహా ఎవరికీ ఫ్లెక్సీలు వేసే పరిస్థితి ఉండేదికాదు. గత ఎన్నికల్లో ఆయన తటస్థంగా ఉండటంతో టీడీపీ కూటమికి చెప్పుకోదగ్గ రీతిలోనే ఆ గ్రామంలో ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో టీడీపీ కూటమికి పనిచేసిన వారు ఎమ్మెల్యే ఇంటూరికి శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయగా వాటిని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయటం చర్చనీయాంశమైంది. కాగా ఫ్లెక్సీలు చించివేతపై వాటిని ఏర్పాటుచేసిన వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

గుంతలతో
నరకం..!


అధ్వానంగా ఉన్న నల్లపరెడ్డిపల్లి రోడ్డు

మూడు గ్రామాలకు శాపం

ఆత్మకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లపరెడ్డి పల్లి రహదారి అడుగడుగునా గోతులు, గుంతలమయమై వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో దీని గురించి పట్టించుకోలేదు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డి పల్లికి, ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. గతంలో పలుసార్లు ఆర్అండ్బీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని, రాత్రివేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే గుంతలు ఎక్కడున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

● వీ సాంబశివయ్య, కందుకూరు టౌన్ ఎస్ఐ



కందుకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ఎక్కడ ఏమి జరిగినా పోలీసులకు తెలిసేలా పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేశామని పట్టణ ఎస్ఐ వి సాంబశివయ్య బుధవారం తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కూడా త్వరలో చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

? పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయిందా

! పట్టణంలో 52 ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు సహకారంతో దాతలు తోడ్పాటునందించారు.

? 52 కెమెరాలతో పట్టణమంతా కవర్ అవుతుందా.

! పట్టణంలోకి వివిధ మార్గాలలో ఉన్న అన్ని ఎంట్రీ పాయింట్స్, ఎగ్జిట్ పాయింట్స్ ప్రధాన సెంటర్లు, నేరస్తుల కదలికలకు అవకాశం ఉండే అన్ని ప్రాంతాలు కవరయ్యేలా ఏర్పాటు చేయించాం.

? ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

! వాణిజ్య ప్రాంతాలలో దుకాణదారులు పుట్పాత్లను ఆక్రమించటంతో వాహనాలు రోడ్లపై పెట్టుకోక తప్పటం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. త్వరలో దుకాణదారులతో సమావేశం ఏర్పాటుచేసి తగు చర్యలు చేపడతాం.

మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం నెల్లూరులో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరి నారాయణను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జిల్లా డెయిరీ మాజీఛైర్మన్ చల్లా శ్రీనివాసరావుతో కలిసి నెల్లూరుకు వెళ్లి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట స్థానిక టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహ్మం, జనిగర్ల నాగరాజు, కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కందుకూరుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

లింగసముద్రం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బుధవారం ఉదయం మొగిలిచెర్లకు చెందిన టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆర్ఆర్ పాలెం, పెంట్రాల, లింగసముద్రం, ఎర్రాఎడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, వీఆర్ కోట, పెదపవని, చినపవని తదితర గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో తరలివెళ్లి ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, కిలారి కొండయ్య, అడపా రంగయ్య, జంపాల కృష్ణ య్య, గొర్రెపాటి సాంబయ్య, ఎ చిన కొండయ్య, జంపాల శివప్రసాద్, గాలంకి ప్రసాద్, సోంపల్లి మనోహర్, బి కొండప నాయుడు, మద్దెల రామారావు, మక్కెన మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురుగొండ్లకు టీడీపీ నేతల శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కలువాయి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులకు బుధవారం కలువాయి మండల టీడీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యేను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో పీర్ల సోమయ్య యాదవ్, గడ్డం కిషోర్రెడ్డి, జగదల్ నాయుడు, హరినాయుడు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల ప్రారంభం

కలువాయి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డుకు కలువాయి సెక్షన్ పరిధిలో మరమ్మతు పనులను రోడ్లు, భవనాల శాఖ అధికారులు బుధవారం ప్రారంభించారు. రూ.50లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఆర్అండ్బి ఏఈ అన్వేష్ తెలిపారు. వెంకటరెడ్డిపల్లి సమీపంలో కల్వర్టు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలియజేశారు. అలాగే తెలుగురాయపురం నుంచి కలువాయి వరకు రోడ్డుకు రూ.12లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు వైద్యపరీక్షలు

వింజమూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ సినార్డ్ (ఎస్ఎన్ఐఆర్డీ) ఆధ్వర్యంలో వింజమూరు మండలంలోని చాకలకొండ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గేదెలకు, మేకలకు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చాకలకొండలోని డాక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రైవేటు పశువైద్య సహాయకులు ఎం నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ రామాంజనేయులు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినార్డ్ స్వచ్ఛంధ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజేంద్రప్రసాద్, రమేష్, పాల్గొన్నారు.


ఆత్మకూరు: మంత్రి ఆనంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ కేతా తదితరులు


కావలి : ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి బొకే అందచేస్తున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ మలిశెట్టి

వాడవాడలా ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

● యువత కేరింతలు ● భక్తులతో నిండిన ఆలయాలు ● నేతల ఇళ్ల వద్ద కార్యకర్తలు, అభిమానుల సందడి

కావలి, జనవరి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ప్రజలు సందడి చేశారు. అనేక చోట్ల కేక్లు కట్ చేసి బాణసంచా కాల్చుకుంటూ యువత కేరింతలు కొట్టారు. ఏరియా వైద్యశాల వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కట్ చేసి పం పిణీ చేశారు. బుధవారం ఉదయం నుంచి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు ఆయన నివాసానికి పోటెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పు చేయకుండా ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని చెప్పారు. కావలిని కనకపట్నంగా మార్చు తామన్నారు.


ఉదయగిరి శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

● కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రజలు ఆలయాలు, చర్చిలకు వెళ్లి పూజలు చేశారు. గ్రామ దేవత కళుగోళ శాంభవి, శివాలయం, విష్ణాలయం, బృందావనం కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సాయిబాబా ఆలయాల్లో ప్రజలు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. బ్రిడ్జి వద్దనున్న తెలుగు బాప్టిస్టు చర్చి, కచ్చేరిమిట్టలోని తెలుగు బాప్టిస్టు చర్చి, సత్యసువార్తిక మందిరం, చర్చి ఆఫ్ క్రైస్ట్ తదితర మందిరాల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్కుమార్ రెడ్డి నివాసంలోని కార్యాలయంలో వైసీపీ శ్రేణులు కేక్కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అన్ని విద్యాసంస్థల్లో వేడుకలు జరిగాయి. మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ప్రభాకర్నాయుడును ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఘనంగా సత్కరించాయి.

● జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అర్ధరాత్రి పలుగ్రామాల్లో యువకులు వీధుల్లో కేరింతలు కొడుతూ ఆంగ్ల సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. మండల అధికారులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, రాజకీయపార్టీల నాయకులకు ప్రజలు ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పలుఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో బుధవారం ఆంగ్ల సంవత్సర వేడుకలు ఆనం దోత్సవాలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు తమ పార్టీ నాయకులతో కలిసి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని కలుసుకుని పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియ చేశారు. తెలుగు తమ్ముళ్లు కొందరు బీద రవిచంద్రను నెల్లూరు పార్టీ కార్యాలయంలో కలసి శుభా కాంక్షలు తెలియచేశారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఆంగ్ల సంవత్సరాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12గంటలకు కేకులు కట్ చేసి హ్యాపీ న్యూఇయర్.. అంటూ యువకులు పట్టణంలో ద్విచక్రవాహనాలపై కేరింతలు కొట్టారు. పలువురు కుటుంబ సభ్యులతో ఆలయాలను సందర్శించారు.

వైసీపీ కార్యాలయంలో..

వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి, కనిగిరి మాజీఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పామూరు రోడ్డులోని తన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో పాలుపంచుకోగా ఆపార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా బుధవారం ఆత్మకూరు లోని దేవాలయాలు, చర్చిలు, మసీదులు భక్తులతో కిటకిట లాడాయి. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అలఘునాధస్వామి, కన్యకాపరమేశ్వరి, అభయాంజనేయస్వామి, శివాలయాలు, సాయిబాబా మందిరం, కాశీనాయన ఆశ్రమం భక్తులతో నిండిపోయాయి. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ జడ్పీఛైర్మన్ బి రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మంత్రి ఆనంకు పలువురి శుభాకాంక్షలు


వింజమూరు : విద్యార్థులకు విద్యాసామగ్రి అందచేసిన నిర్వాహకులు

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డికి నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరుకు చెందిన పలువురు ప్రజాప్రతి నిధులు, అధికారులు, పురప్రముఖులు, టీడీపీ, జనసేన, బిజెపి నేతలు, అభిమానులు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిజేశారు. ఆర్డీవో బి పావనికి, డీఎస్పీ కె వేణుగోపాల్కు, సీఐ జి గంగాధర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, ఎంపీడీవో పి ఐజాక్ప్రవీణ్లకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పురప్రముఖులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో...


సంగంలో కేక్కట్ చేస్తున్న తహసీల్దారు సోమ్లా నాయక్

స్థానిక బిసి, ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికల వసతిగృహాల్లో విద్యార్థులు నూతన సంవత్సర సంబ రాలను జరుపుకున్నారు. ఆత్మకూరు బిసి సహాయ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ఏఎస్డబ్ల్యుఓ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

మండలంలోని ఆలయాలు నూతన సంవత్సరం ప్రారంభం సందర్భగా బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన సంగం శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా, రాజరాజేశ్వరాలయాలకు భక్తులు వెళ్లి దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా క్రైస్తవులు చర్చిల్లో అర్ధరాత్రి వరకు ప్రార్థనలు చేశారు. తమ అభిమాన నాయకుని వద్దకు పూలమాల, పండ్లు, శాలువాలతో వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సంతోషంగా గడిపారు. దీంతో రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద కార్యకర్తలతో సందడిగా మార్చాయి.

● ఉదయగిరి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలో పలు ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గండిపాళెం సిద్ధేశ్వరాలయం, గుడినరవ, అప్పసముద్రం, శివాలయాలు, లింగాలదొన క్షేత్రం, కుర్రపల్లిగడ్డ సంగమేశ్వరాలయం, ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరి, సంతానలక్ష్మి ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు, సందర్శకులు మండలంలోని గండిపాళెం జలాశయ ప్రాంగణానికి చేరుకొని ఉల్లాసంగా కాలం గడిపారు. అక్కడే ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ఆలయ ప్రాంగణంతో సహా జలాశయం వద్ద సందడి చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ కాలనీలోని హోలీమినిస్ట్రీస్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని వ్యవస్థాపకులు ప్రేమానందం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్రావు, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ ముఖ్యఅతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్యాదవ్, శ్యామ్యూల్ మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ తాతపూడి రాజశేఖర్, పొద మాధవరావు, నాదిండ్ల రాజేంద్ర, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఎడ్యుకేషనల్ అకాడమీ, నవోదయ కోచింగ్ సెంటర్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో ముందుగా నూతన సంవత్సరం కేకును కట్ చేసి ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు పంపిణీ చేశారు. అకాడమీ నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కె రామయ్య, వెలుగోటి చెంచయ్య, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు తీసుకువచ్చిన భారీ కేక్ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను బుధవారం కందుకూరులో ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, అనధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావటంతో ఆయన కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వ రావుల నేతృత్వంలో కందుకూరు నియోజకవర్గంలోని ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఇతర రెవిన్యూ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారందరినీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేరుపేరునా పలకరించి అభినందనలు తెలియజేయటంతో పాటు వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, వివిధ మండల పార్టీల అధ్యక్షులు ఉన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నివాసం వద్ద కూడా నూతన సంవత్సర వేడుకల కోలాహలం నెలకొంది.


సంగం హైవే వద్ద కేక్ కట్ చేస్తున్న సీఐ వేమారెడ్డి

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కొం దరు యువకులు మంగళవారం అర్ధరాత్రి హైవే వద్ద సీఐ వేమారెడ్డిచే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సర్కిల్ పరిధిలోని సంగం, చేజర్ల, ఏయస్పేట ఎస్ఐలు సీఐ వేమారెడ్డిని సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ కేక్ కట్ చేశారు. ఎంపీడీవో షాలెట్కు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు.

న్యూస్ బాక్స్

8 నుంచి టాలెంట్ టెస్ట్


కరపత్రం విడుదల చేస్తున్న నేతలు

ఆత్మకూరు జనవరి 1 (ఆంధ్రజ్యోతి) అపస్మా ఆధ్వర్యంలో మనోహర్రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎంఎంటీఎస్ఈ) పాఠశాల స్థాయిలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఎంటీఎస్ఈ కన్వీనర్ రమణారెడ్డి, అపస్మా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఈగ భాస్కర్రెడ్డి తెలిపారు. పట్టణంలోని రెయిన్బో ఇంగ్లీషు మీడియం స్కూల్లో బుధవారం అపస్మా నేతలు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించిన అనంతరం, ఈనెల 24న నియోజకవర్గస్థాయిలో, ఫిబ్రవరి 4న జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా జిల్లా సెక్రటరీ రామ్మోహన్రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, సెక్రటరీ మల్లికార్జునరాయుడు, ట్రెజరర్ వెంకటేశ్వరరెడ్డి, గౌరవాధ్యక్షుడు టీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

కావలి, జనవరి1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న 40 మందికి ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్యారేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో కండక్టర్ల గ్రూపు సహకారంతో డీఎం శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కల్పన, ఏఈ ఎస్కే ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, డిపో క్లర్క్ బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా వీటిని అంద చేశారు. కార్యక్రమంలో కండక్టర్స్ గ్రూపు అడ్మిన్లు హరిప్రసాద్, ఏడీవై గని షేక్ కాలేషా, పీ. సుబ్బారావు,పులిశెట్టి శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న యువత, మహిళలు

కొండాపురం, జనవరి1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో యువత, మహిళల పాత్ర ఎంతో కీలకమని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు మండలంలో 12,300పైగా సభ్యత్వాలు నమోదు జరిగిందన్నారు. సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెం, ఇస్కపాలెం, వెల్లటూరివారిపాలెం గ్రామాల్లో అత్యధికంగా సభ్యత్వం నమోదు జరిగిందన్నారు.

ఊరూరా వేడుకలు

రూరల్, కోవూరు, సర్వేపల్లి

హ్యాపీ... న్యూ ఇయర్!!



జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో భక్తుల సందడి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడ కామాక్షితాయి ఆలయానికి భక్తజనం పోటెత్తింది. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు జరిగాయి. తెల్లవారుజాము 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శనవేళలు నిర్ణయించారు. అయితే రద్దీ నేపథ్యంలో మధ్యాహ్నం గంట, రాత్రి గంటపాటు దర్శన వేళలు పొడిగించారు. భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. రాత్రి 7గంటలకు గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామివారికి కల్యాణం వేడుకగా జరిగింది. అనంత రం రాత్రి 9గంటలకుపైన పెద్ద వెండినంది వాహనంపై కొలువుదీరిన ఆదిదంపతులు భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. ఈ సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

ఆంగ్ల సంవత్సరం సందర్భంగా బుధవారం మండలంలోని యువతీ,యువకులు, విద్యార్థులు, నాయకులు, అధికారులు ప్రజలు కేక్‌లు కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బుచ్చిలోని హోటళ్లు, దాబాలు, దుకాణాల్లో ఆఫర్లతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. బ్రాందీషాపులు మందుబాబులతో కిటకిటలాడాయి. చికెన్ సెంటర్లలో కొనుగోలుదారులతో రద్దీ నెలకొంది.

● కోవూరు(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఆంగ్ల సంవత్సర వేడుకల్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పట్టణంలోని పురాతన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఉద యం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు జనార్దనం నాగరాజాచార్య లు పూలంగి సేవ, పల్లకీసేవ నిర్వహించారు. లక్ష్మీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకు డు అప్పలాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పురాతన శివాలయం, గ్రామ దేవత నాగవరప్పమ్మ ఆలయంలో అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ప్రత్యేకపూజలు చేశారు. వేగూరు లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, మోడేగుంటలోని నాగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. స్థానిక శారాబిలాక్ చర్చిలో పాస్టరు డీ రాజేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు కూడళ్లల్లో యువకులు కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజకీయ పార్టీల నాయకు ల ఇళ్ల వద్ద కార్యకర్తలు సందడి చేశారు.

● కొడవలూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు బుధవారం తెల్లవారుజాము నుంచే కొడవలూరులోని శివాలయం, నాగేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భారీగా చేరుకుని స్వామివార్లను దర్శించుకున్నారు. కొత్త సంవత్సరంలో ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు.

● పొదలకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12గంటలకు కేక్‌కట్ చేసి, ఉదయాన్నే పలువురు స్నానాలు ఆచరించి స్థానిక ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శివాలయం, అయ్యప్పనగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, సాయిబాబా మందిరం, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



కోవూరు : వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ

నూతన ఆలోచనలతో మెరుగైన పాలన అందిద్దాం

● నగర మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల నూతన సంవత్సరాదికి స్వాగతం పలుకుతూ నగర ప్రజలకు మరింత మెరుగైన పాలనను నూతన ఆలోచనలతో అందిద్దామని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి పిలుపునిచ్చారు. ఆమె బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగుల నుంచి నూతన ఏడాది శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులం ఉమ్మడి నిర్ణయాలతో కలిసి ముందుకు వెళ్దామని చెప్పారు. కాగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో సంతాప దినాలు అమల్లో ఉన్నందున కమిషనర్ సూర్యతేజ హంగు, ఆర్భాటాలకు దూరంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఆరోగ్య విభాగం అధికారులు

ఎన్‌డీసీసీబీలో..

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఎం శ్రీనివాసరావును కోఆపరేటివ్ బ్యాంకు రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన కార్యాలయంలో వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహిం చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లాల శ్రీనివాస మహరాజ్, కమిటీ సభ్యులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. 2025వ సంవత్సరంలో నిత్యం ప్రజల మధ్య ఉంటూ పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కిషోర్ పిలుపునిచ్చారు.

సోమిరెడ్డి కార్యాలయంలో...

నెల్లూరు (వైద్యం) : నగరంలోని వేదాయపాళెంలో ఉన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన పిలుపు మేరకు పుష్పగుచ్చాలు, శాలువాలను విడనాడి పేదలకు దుప్పట్లు, చీరలు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పొదలకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని బుధవారం మండలం లోని బిరదవోలు టీడీపీ నాయకులు కలిసి ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు గిరిజన కాలనీలో దుప్పట్లు, విద్యార్థులకు పలకలు, పెన్నులు పంపిణీ చేశామని రావుల శ్రీనివాసులుగౌడ్, రావుల భాస్కర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడుగు శ్రీనివాసులుగౌడ్, చిడదల పెంచలయ్య, పోసిన చిన్నాబ్బాయి, బడుగు చెంచుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

అందరి నోట ఇదే మాట
ఆనందోత్సాహాలతో ఆంగ్ల సంవత్సరాది

కొత్త సంవత్సర ఆరంభాన్ని నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి గడియారం 12 గంటలు కొట్టగానే యువత కేరింతలు కొడుతూ 2025వ సంవత్సరానికి స్వాగతం పలికారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని, కేకులు కట్ చేసి, ఆటపాటలతో ఆనందం వ్యక్తం చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బుధవారం ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిగాయి. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కార్యకర్తల సందడి నెలకొంది. ప్రజా ప్రతినిధులు, నాయకులను ఘనంగా సత్కరించి నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి కారణంగా ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త సంవత్సర వేడుకలు నిరాడంబరంగా జరిగాయి.



శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న కార్యకర్తలు

కార్యకర్తల కష్టంతోనే ఈ స్థాయికి..

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారి రెక్కల కష్టంతోనే తనకు నుడా చైర్మన్ పదవి వచ్చిందని నుడా చెర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. బుధవారం టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కోటంరెడ్డి నివాసానికి తరలి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సన్మానించారు. కార్యకర్తలకు అన్నీ వేళలా అందుబాటులో ఉంటానని, ఏ అవసరం ఉన్నా నేరుగా కలవాలని సూచించారు.



టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సంబరాలు

నెల్లూరురూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం కిక్కిరిసింది. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందుబాటులో ఉండటంతో ఆ పార్టీ నాయ కులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. గజమాలలు, పుష్పగుచ్చాలు, శాలువాలు, పండ్లు, పూలమొక్కలతో శుభాకాంక్షలు తెలియచేశారు.

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సర వేడుకలను మండల ప్రజలు బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కసుమూరు, గొలగమూడితో పాటు ఆయా గ్రామాల్లో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలు, సోమిరెడ్డి అభిమానులు బుధవారం వేదాయపాలెంలోని సోమిరెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుని సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున దుప్పట్లు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని గిరిజన, పేద విద్యార్థులకు ఇచ్చేందుకు తీసుకువచ్చి సోమిరెడ్డికి అందజేశారు. వెంకటాచలంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలోని పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటాచలం మాజీ సర్పంచి మండల మోహన్‌రావు, టీడీపీ నేత గంట బాబు, తదితరులు పాల్గొన్నారు.



మానసిక దివ్యాంగుల కేంద్రంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండల టీడీపీ నాయకులు

● తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం అల్లీపురంలోని తన స్వగృహంలో మండలం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, నేతలు మన్యం జితేంద్ర, షేక్.అబూబకర్, కొణతం రఘుబాబు, చేవూరు శ్రీనివాసులు, చింత సీతారామయ్య, పలువురు కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఆంగ్ల సంవత్సరానికి మండల ప్రజలు ఘన స్వాగతం పలికారు. 31వతేదీ రాత్రి నుంచి తెల్ల వారుజాము వరకు చర్చిల్లో పాటలు, ప్రార్థనలతో గడిపి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇస్కపాలెం సెంటర్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్త పాలెంలో భారీ కేక్ కట్ చేశారు. కోడూరు, కాటేపల్లి సముద్ర తీరాల్లో సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

● విడవలూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఊటుకూరు గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన నాయకులు కొప్పోలు శ్రీనివాసులు, చెన్నంశెట్టి సాయి కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. టీడీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి విజయభానురెడ్డి కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు సుధానంద్, సుమంత్‌రెడ్డి, శివశంకర్, పెంచలయ్య, తదతరులు పాల్గొన్నారు. అలాగే విడవలూరులో ఈస్ట్రన్ ఛానల్-2 డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ కేక్ కట్ చేశారు. రామతీర్థంలో ఏపీ సంప్రదాయ మత్స్యకార సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల వాసును మత్స్యకారులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

● సైదాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆంగ్ల సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్దేశ్వర కోనలో స్వామివార్లకు, దక్షిణామూర్తి ఆలయంలో స్వామివారికి విశేష పూజాలంకరణలు చేశారు. సైదాపురం, కలిచేడు, చాగణం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మనుబోలు పీఏసీఎస్ అధ్యక్షుడిగా రామకృష్ణయ్య



మనుబోలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థా నిక ప్రాథమిక వ్యవ సాయ సహకార పర పతి సంఘం (పీఏసీ ఎస్)అధ్యక్షుడిగా పొన్నూరు రామకృష్ణయ్యను ఎంపిక చేశారు. రెండురోజుల కిందట ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పొన్నూరు పేరును ప్రతి పాదించారు. బద్దెవోలుకి చెందిన రామకృ ష్ణయ్య ప్రస్తుతం టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. డైరెక్టర్లుగా మనుబోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకట రమణయ్య, మడమనూరు టీడీపీ యువ నాయకులు ఉడతా విజయ్‌కుమార్ పేర్లను ప్రతిపాదించారు. తమ పేరు ప్రకటించినందుకు బుధవారం ఎమ్మెల్యేకు పొన్నూరు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే వీరంతా బాధ్యత లు చేపట్టనున్నారు

మర్లపూడి సర్పంచు మృతి



రమణయ్య(ఫైల్)

సైదాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపూడి సర్పంచు మోడి రమణయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం టీడీపీ నాయకులు వరదబండి హరనాథ్‌రెడ్డి, వరదబండి వెంకటేశ్వర్లురెడ్డి పలువురు నాయకులు రమణయ్య అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు టీడీపీ మద్దతుతో సర్పంచుగా రమణయ్య గెలుపొందారు.

5న మధురానగర్ వెంచర్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు దగ్గర గల భూమి ఇన్‌ఫ్రా రియాల్టీ కార్యాలయంలో బుధవారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కంపెనీ చైర్మన్ కోటేశ్వరరావు, ఎండీ శ్రీహరి కృష్ణారెడ్డి, డైరెక్టర్ భవానీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 5వతేదీన తమ నూతన వెంచర్ మధురానగర్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అధునాతన వసతులు, అందుబాటు ధరల్లో ప్లాట్లు లభిస్తాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



భూమి ఇన్‌ఫ్రా రియాల్టీ కార్యాలయంలో జరిగిన ఆంగ్ల సంవత్సర వేడుకల్లో యాజమాన్యం, సిబ్బంది

సరస్వతీ సమాజంలో
పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల కేంద్రం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల కోసం లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి ప్రారంభించారు. ప్రభుత్వ పెన్షన్‌దారులు ప్రతీ ఏడాది లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని, లేకుంటే వారికి పెన్షన్ రాదని తెలిపారు. పెన్షనర్స్ కోసం నగరంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాగా, సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. సమాజం వ్యవస్థాపక సభ్యుడు బలరామిరెడ్డి, సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, ట్రెజరీ అధికారులు షేక్ అహ్మద్, అబోజ్‌బాషా, మోషే, యుగంధర్, శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.



లైఫ్ సర్టిఫికెట్ కేంద్రంలో జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి, పెంచలయ్య, పెన్షనర్లు

బీటీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) డైరీ, క్యాలెండర్‌ను నగరంలోని ఆ సంఘం కార్యాల యంలో బుధవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ ఆవిష్కరించారు. రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సంక్షేమానికి సంఘం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు నూకలపాటి రమణయ్య, రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, కార్యదర్శి మాన ప్రసాద్, పల్లం వేణుగోపాల్ పాల్గొన్నారు.

వాకర్స్ సంఘం క్యాలెండర్...

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కిమ్స్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజు ఆవిష్కరించారు. వాకర్స్ సంఘం సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘం గౌరవా ధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, నూతన అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.



బీటీఏ డైరీలను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

సావిత్రీబాయి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నెల్లూరు(విద్య), జనవరి 1 (ఆం ధ్రజ్యోతి) : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే జయంతిని ఈనెల 3న ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌టీఏ) అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా కోరారు. ఈ మేరకు బుధవా రం మంత్రి నారాయణను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కోలా కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఆర్‌టీఏ నాయకులు

ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రాలు ఇవ్వాలి

రాపూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా జనవరి 4వ తేదీన జిల్లాకు వస్తున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణ జరగాలని కోరుకునే అన్ని పార్టీల్లోని మేధావులు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీ నేతలు, మాదిగలు వినతి పత్రాల రూపంలో కమిషన్‌కు నివేదికలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రంగయ్య మాదిగ బుధవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీల్లోని 59 కులాలకు సమాన అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు.

నేడు ఎంపీ బీదకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన బీద మస్తాన్‌రావును గురువారం ఘనంగా సన్మానిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బొమ్మి నాగకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నగరంలోని ఓ హోటల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని, బీసీ సంక్షేమ సంఘాలకు చెందిన అందరూ హాజరు కావాలని కోరారు.

కరాటేలో ఇబ్రహీం రికార్డు

నెల్లూరు(విద్య), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో నగరానికి చెందిన షేక్ ఇబ్రహీం రికార్డు సాధించారు. మోస్ట్‌ఫుల్ కాంటాక్ట్ ఎల్బో స్ట్రైక్ ఇన్ త్రీ మినిట్స్ పోటీల్లో అత్యధిక సమయం పోటీలో నిలవడంతో నిర్వాహకులు రికార్డ్ సర్టిఫికెట్‌ను పంపించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బుధవారం ఆయన నివాసంలో ఇబ్రహీం మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు.





ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది



స్టీల్‌ప్లాంటులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఏం జరిగింది?

ఎంత మంది ఉన్నారు?

పెన్నేపల్లి స్టీల్‌ప్లాంట్ అగ్ని ప్రమాదంపై అయోమయం

పెళ్లకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏం జరిగింది? ప్రమాద సమయంలో లోపల ఎంత మంది ఉన్నారు? ఇదీ పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో తలెత్తుతున్న ప్రశ్నలు. బయట నుంచి సేకరించే వేస్ట్‌ను కరిగించే ఫర్నేస్ బాయిలర్ పేలడంతో మంటలు చెలరేగాయి. తీవ్రంగా గాయపడిన ఏడుగురు కార్మికుల్లో నాలుగురిని నాయుడుపేట.. ముగ్గురిని నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. వీరంతా బీహార్‌కు చెందిన వారే. గాయపడిన వారిలో రవి బర్వాజ్, సోనూ మహమ్మద్, విశ్వకర్మ, సి.ముని ప్రస్తుతం నాయుడుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, నైట్ షిఫ్టులో 50 మందికిపైగా ఉన్నట్లు చెబుతున్నారు. అసలు ఎంత మంది లోపల పనిచేస్తున్నారు? బయటకు ఎందరు వచ్చారు? ఎంతమందికి గాయాలయ్యాయనే అంశాలపై బుధవారం రాత్రి 12.40 గంటలకూ స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. ఏడుగురిని మాత్రం ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమాచారం తెలియగానే నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు, సిబ్బంది.. తహసీల్దారు ద్వారకానాథరెడ్డి, వీఆర్వో రమేష్ తదితరులు ప్లాంటు వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు.

విద్యార్థుల పాద పరిమాణాలను నమోదు చేయండి

తిరుపతి(విద్య), జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్‌లను అందించేందుకుగాను వారి పాదాల కొలతలను నమోదు చేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ ఆదేశించారు. 1నుంచి 10వ తరగతి విద్యార్థుల పాదాల కొలతలను తీయించి ఎస్ఆర్‌కేవీఎం యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు కార్యక్రమం 100 శాతం పూర్తికావాలని స్పష్టం చేశారు. కిట్లలో నోటు పుస్తకాలు, బెల్ట్, బూట్లు, బ్యాగ్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్ వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫారం క్లాత్‌తోపాటు మరికొన్ని వస్తువులు ఉంటాయని వివరించారు. డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేయడమేగాక హార్డ్ కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

'కొత్త' సందడి

నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామునే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలి రోజున దైవ దర్శనం చేసుకుంటే ఏడాదంతా మంచే జరుగుతుందన్న భావనతో గుళ్లకు వెళ్లారు. పార్కులు.. జలాశయాలు.. కొండా కోనల్లోను ఉత్సాహంగా గడిపారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

● ఆధ్యాత్మికం



గోవిందా.. గోవిందా

తిరుమల శ్రీవారి ఆలయ ముందుభాగం మంగళవారం రాత్రి 11 గంటలకే భక్తులు, స్థానికులతో నిండిపోయింది. సరిగ్గా 12 గంటలు కాగానే ఆలయం వైపు తిరిగి శ్రీవారికి నమస్కరించారు. ఒక్కసారిగా గోవింద నామస్మరణలు చేయడంతో ఆ ప్రాంతం మార్మోగింది. కొందరు కళ్లు మూసుకుని ప్రార్థనలు చేస్తూ కనిపించారు. వేకువజాము 4 గంటల వరకు ఆలయం ముందు భక్తుల సందడి నెలకొంది. ఇక, బుధవారం రోజు తిరుమలలో వీఐపీలు మినహా సాధారణ భక్తుల రద్దీ తక్కువగానే కనిపించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 28 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,773మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,001మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 977 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 320, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 84మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 78మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 31మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,009 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



● పర్యాటకం

సదాశివకోనలో సందడి

ఏర్పేడు మండలంలోని చెల్లూరు పంచాయతీ వద్ద ఉన్న సదాశివకోన వద్ద ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సందర్శకులు పోటెత్తారు. జలాశయంలో కేరింతలు కొడుతూ మునిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



జలపాత స్నానాలు



తిరుపతి నగరంలోని కపిలతీర్థానికి బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. పుష్కరిణి వద్ద సెల్ఫీలు దిగారు. జలపాతం వద్ద స్నానాలు చేశారు. కామాక్షి సమేత కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇలా.. భక్తులతో రోజంతా సందడి నెలకొంది.

- తిరుపతి (కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి

సీఎం, గవర్నర్లకు టీటీడీ వేదాశీర్వచనం

నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉండవల్లిలోని నివాసంలో టీటీడీ వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు సీఎంకు టీటీడీ డైరీ, క్యాలెండరును అందజేశారు. వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. అలాగే, విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కూడా టీటీడీ వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈసందర్భంగా ఈవో శ్యామలరావు శ్రీవారి లడ్డూప్రసాదాలు, డైరీ, క్యాలెండర్లు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రూ.33.44 కోట్లు!

ఇదీ మూడు రోజుల్లో మందుబాబుల మద్యం ఖర్చు

కొత్త ఆంగ్ల సంవత్సరాదికి మందుబాబులు ఖుషీ చేశారు. మూడు రోజుల్లో దాదాపు రూ.33.44 కోట్ల మద్యాన్ని తాగారు. ఇందులో డిసెంబరు 31వ తేదీన రూ.13.10 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 227 మద్యం దుకాణాలు, 24 బార్లు ఉన్నాయి. 2023 ఏడాది చివర.. డిసెంబరు 30వ తేదీన 7300 కేసుల బీర్లు, 15,500 కేసుల లిక్కర్ విక్రయాలు జరిగాయి. తద్వారా దాదాపు రూ 11.02 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక, న్యూ ఇయర్ వేడుకలు జోష్‌గానే సాగాయి. డిసెంబరు 31న ఉదయం నుంచే మందుపార్టీలు చేసుకున్నారు. వీరిలో 20 నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఎక్కువగా ఉన్నట్లు అంచనా. ముఖ్యంగా బార్లు కంటే మద్యం దుకాణాల్లోనే విక్రయాలు ఎక్కువగా జరిగాయని తెలిసింది. 31వ తేదీన 9200 కేస్‌ల బీర్లు, 10,400 కేస్‌ల లిక్కర్ విక్రయాలు జరిగాయి. తద్వారా రూ.13.10 కోట్ల లావాదేవీలు జరిగాయి. 30వ తేదీతో పోలిస్తే 31న లిక్కర్ అమ్మకాలు తక్కువ. ఆ రోజు దుకాణాల వద్ద రద్దీ.. కొరత ఉండొచ్చన్న భావనతో ముందురోజే లిక్కర్‌ను మందుబాబులు తీసి పెట్టుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, 2023 డిసెంబరు నెలాఖరులో జరిగిన విక్రయాలతో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 67 శాతం పెరిగినట్లు అంచనా. ఇక, జనవరి 1న ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు.. రూ.9.32 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిసింది. ఇలా మూడు రోజుల్లో రూ.33.44 కోట్ల మద్యాన్ని మందుబాబులు తాగారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్ కేసులు 250

కొత్త సంవత్సరమని ఫుల్‌గా మందేశారు. మద్యం మత్తులో రోడ్డుపైకి వాహనాలు నడుపుతూ వచ్చారు. ఇలా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లాలో మందుబాబులు హల్‌చల్ చేశారు. బ్రీత్ అనలైజర్ ద్వారా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 250 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదయ్యాయి. మిగతా వాళ్లు పోలీసులను చూసి పక్క వీధులగుండా.. లేదా వెనక్కి వెళ్లిపోయి తప్పించుకున్నారు. రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు ఎస్పీ సుబ్బరాయుడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిరగడంతో అధికారులు, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. దీంతో ఎక్కడా మందుబాబుల ఆగడాలు.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టడి చేయగలిగారు. తిరుపతి నగరంతో పాటు రూరల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 9 గంటల నుంచి రిజర్వు, శాంతి భద్రతలు, ఎస్టీఎఫ్, ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. కాగా, పట్టుబడిన 250 మందిలో 20 నుంచి 35 సంవత్సరాల వారు 90 మంది వరకు ఉన్నట్లు అంచనా. దాదాపు 180 మంది వరకు ద్విచక్రవాహనదారులే ఉన్నారు. 6 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మందుబాబుల తనిఖీల్లో అత్యధికంగా బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ 339 వరకు వచ్చినట్లు సమాచారం.



తిరుపతిలో మంగళవారం రాత్రి తనిఖీలు



బులుగు పోయె.. పసుపు వచ్చె..

ఢాం.. ఢాం.. ఢాం!

వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వ భవనాలకీ, ప్రభుత్వం కట్టించిన పేదల ఇళ్లకీ, ఆఖరికి చెట్లకీ, కరెంటు స్తంభాలకు కూడా పార్టీ రంగులేసి నవ్వుల పాలయ్యారు. ప్రభుత్వ సొమ్ముతో పార్టీ సోకులా అని విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా జగన్ బాటలోనే నడుస్తున్నట్లు ఉంది. దామినేడులోని ఇందిరమ్మ ఇళ్ల రిపేరు పనులు చేస్తూ పనిలోపనిగా పసుపు రంగు వేస్తున్నారు. అధికారుల అత్యుత్సాహమో.. నాయకుల ఆదేశమోగానీ దారిన పోయేవారు ఈ రంగు చూసి.. 'అప్పుడు వారూ.. ఇప్పుడు వీరూ.. సేమ్ టు సేమ్' అనుకుంటున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాద భవనంలో మరో కియోస్క్

తిరుమల, జనవరి1(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో విరాళాల సమర్పణ కోసం టీటీడీ బుధవారం మరో కియోస్క్‌ను ప్రారంభించింది. అన్నప్రసాదం ట్రస్టుకు సులభతరంగా విరాళాలు అందించేందుకు ఇప్పటికే సౌత్ ఇండియన్ బ్యాంక్ అందజేసిన కియోస్క్‌ను టీటీడీ డిసెంబరు నెలలో ప్రారంభించింది. తాజాగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళంగా ఇచ్చిన మరో కియోస్క్‌ను బుధవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. ఈ మిషన్ల ద్వారా భక్తులు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు తక్కువ మొత్తాన్ని (రూ.1 నుంచి రూ.99 వేల వరకు) కూడా విరాళంగా అందజేయవచ్చు. కియోస్క్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా విరాళాలు టీటీడీ ఖాతాలో జమచేయవచ్చు.

కొత్త శానంబట్లలో జల్లికట్టు





చంద్రగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కొత్త శానంబట్లలో బుధవారం పశువుల పండుగ(జల్లికట్టు) నిర్వహించారు. పరిసరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పశువులను తీసుకొచ్చారు. వీటికి కొమ్ములు చెలిగి, రంగులు వేసి కొప్పులను తొడిగారు. నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలతో అలంకరించారు. రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలతో పాటు, నగదు, దుస్తుల, విలువైన వస్తు సామగ్రిని కట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామ నడివీధిలో పశువులను గుంపులుగా వదిలారు. వేలాది మంది యువకులు అల్లె అవతల నిలబడ్డారు. కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీపడ్డారు. చెక్కపలకలను చేజిక్కించుకోవడంలో యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. కొందరు కింద పడటంతో పదిమందికిపైగా తీవ్రంగాను.. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సహంగా కేరింతలు కొట్టారు. పశువుల పండగను తిలకించడానికి వచ్చిన వారందరికీ గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

2025లో నా ప్రాధాన్యాలు

మట్టిరోడ్లు కనిపించకుండా చేస్తా



ఎమ్మెల్యే కురుగొండ్ల

అన్ని గ్రామాలకు రోడ్లు నిర్మిస్తాం

1 గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లపై తట్టెడు మట్టి వేయలేదు. నియోజకవర్గంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. సుమారు రెండు వందల కిలో మీటర్లు మేర గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటన్నిటికి ప్రతి పాదనలు సిద్ధం చేశాం. ఏడాది లోగా మట్టిరోడ్లు కనిపించకుండా చేయడమే లక్ష్యం.

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు పరిష్కారం

2 వెంకటగిరి మున్సిపాలిటీలో పైపులైన్లు దెబ్బతినడం వల్ల తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో కొత్త పైపులైన్ల నిర్మాణానికి రూ.9 కోట్లతో ప్రతి పాదనలు సిద్ధం చేశాం. ఏడాదిలోగా పట్టణవాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా.

తెలుగుగంగ కాలువకు తూముల ఏర్పాటు

3 తెలుగుగంగ బ్రాంచి కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. బ్రాంచి కాలువలతో పాటు తెలుగుగంగ కాలువకు డక్కిలి, మోపూరు, తురకపల్లి గ్రామాల వద్ద తూములు ఏర్పాటు చేయడం ద్వారా 2 వేల ఎకరాల ఆకట్టుకు సాగు నీరు అందుతుంది. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తెలుగుగంగ నీటిని పూర్తి స్థాయిలో రైతులకు అందేలా చూస్తా.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: పాశం



సునీల్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరాది వేడుకలు నిర్వహించారు. పాశం సునీల్‌కుమార్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను భారీ పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది లో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తామ న్నారు. అదేవిధంగా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్, పంబలేరు వాగుపై వంతెన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారు తీసుకొచ్చిన పుస్తకాలు, విద్యాసామగ్రి పేద విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలి: కురుగొండ్ల



కురుగొండ్లకు పండ్ల బుట్ట అందజేస్తున్న వెంకటేష్, పెంచలయ్య

వెంకటగిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆకాంక్షించారు. బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు ప్రభాకర నాయుడు, రాజగోపాల్ నాయుడు, వెంకటేష్, పెంచలయ్య, మస్తాన్ నాయుడు, సత్యం, సీసీ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వెంకటగిరి, కాపా శ్రీనివాసులు నాయుడు, సుబ్రహ్మణ్యం రాజు, కృష్ణమరాజు, కట్టా మోహన్ కృష్ణారెడ్డి, కోటయ్య నాయుడు, రమణయ్య నాయుడు, దశయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేకు నేతలు, అధికారుల శుభాకాంక్షలు



కురుగొండ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో గుణశేఖరరెడ్డి

డక్కిలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలానికి చెందిన పలువురు అధికారులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ శివశంకర్, ఈవోపీఆర్డీ అల్లాభక్షు, ఎంఈవో జగదీష్ బాబు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, దందవోలు రత్నాకరరెడ్డి, డక్కిలి సాగునీటి సంఘం అధ్యక్షుడు సునీల్, సర్వేపల్లి రత్నయ్య తదితరులు ఉన్నారు.

లూథరన్ చర్చి కార్యవర్గం ఎన్నిక



లూథరన్ చర్చి కార్యవర్గంతో పాస్టర్ ప్రశాంత్‌బాబు

వాకాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లూథరన్ చర్చి నూతన కార్యవర్గాన్ని పాస్టర్ ప్రశాంత్‌బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూనియల్ చంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా జాలాది కిషోర్‌బాబు, కార్యదర్శిగా రాజ్‌కుమార్, కోశాధికారిగా సాల్మన్ చంద్రశేఖర్ బాబు, సభ్యులుగా అబ్రహం, రాజు, భాస్కర్ ఎన్నికయ్యారు.

గొబ్బెమ్మల సందడి

కోట, జనవరి 1: (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సాయంత్రం పూట మహిళలు, యువతులు గొబ్బెమ్మలు ఆడుతూ సందడి చేస్తున్నారు. ప్రధానంగా శ్రీలక్ష్మమ్మకాలనీ, కోటమ్మగుడి కాలనీ, గూడలి, చిట్టేడు గ్రామాల్లో గొబ్బెమ్మల సందడి మొదలైంది.



కోట గిరిజన కాలనీలో గొబ్బెమ్మలు ఆడుతున్న చిన్నారులు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. మొదటి మ్యాచ్ నారాయణ - ప్రాస్పరో పాఠశాల మధ్య జరగగా ప్రాస్పరో పాఠశాల జట్టు, రెండో మ్యాచ్ ఆదిశంకర - శ్రీచైతన్య జట్ల మధ్య జరగగా శ్రీచైతన్య జట్టు, మూడో మ్యాచ్ విందూరు జడ్పీ - గూడూరు జడ్పీ మధ్య జరగగా గూడూరు జడ్పీ జట్టు, నాలుగో మ్యాచ్ సీఎస్ఎం - ఎల్‌పీపీ మధ్య జరగగా ఎల్‌పీపీ జట్లు విజయం సాధించాయి. ఈ మ్యాచ్‌లను మునిగిరీష్, లవకుమార్ పర్యవేక్షించారు.

2025లో నా ప్రాధాన్యాలు

నెల్లూరు జిల్లాలో గూడూరు విలీనానికి కృషి

ఎమ్మెల్యే పాశం

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి



1 వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన అసంబద్ధంగా చేయడంతో గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చింది. జిల్లా కేంద్రమైన తిరుపతి దూరంగా ఉండడంతో నియోజకవర్గ ప్రజలు, అధికారులు వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని నేనే కూడా అసెంబ్లీలో ప్రస్తావించా. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తా.

పంబలేరు వాగుపై వంతెన పూర్తి చేస్తాం

2 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.19 కోట్ల అంచనాతో పంబలేరు వంతెన పనులకు శంకుస్థాపన చేశా. గత వైసీపీ ప్రభుత్వంలో వంతెనను నిర్మించారు. కానీ అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో అసంపూర్తిగా ఉంది. గూడూరు ప్రజల అభిలాష అయిన ఈ వంతెనను ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా. ఇందుకోసం రూ.8 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది.

అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పూర్తి చేయడం

3 గూడూరు ఒకటో, రెండో పట్టణానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మించిన ఫ్లైఓవర్ 13 ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. కూటమి ప్రభుత్వం హయాంలో ఈ వంతెనను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తా.

స్వర్ణ కాంతుల్లో చెంగాళమ్మ



బంగారుచీర అలంకారంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ

సూళ్లూరుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా బుధవారం స్వర్ణశోభతో వెలుగొందారు. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు, టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్ దంపతులు, నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవ నాయుడు, ఏజీ కిషోర్ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. రంగువల్లులు, విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



విశేష అలంకారంలో మన్నారుపోలూరులోని చెంగాళమ్మ





గూడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు - నాయుడుపేటలోని పోలేరమ్మ ఆలయంలో భక్తుల పూజలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గూడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ఆలయాల్లో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబాగుడి, కోదండ రామాంజనేయస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, బాలాజీ నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని ఎస్‌ఎల్‌సీ చర్చి, ప్రార్థనా మందిరం, హోసన్నమందిరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని కుందకూరు సమీపంలో గల కనుమరాయికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వర ఆలయం, పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయం, జనార్దనస్వామి ఆలయం, కోటమ్మ ఆలయం, విద్యానగర్‌లోని బాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా విద్యానగర్, కోట పట్టణంలోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నాయుడుపేట(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాయుడుపేట పిచ్చిరెడ్డితోపులోని విజయగణపతి దేవస్థానం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

తడ(ఆంధ్రజ్యోతి): స్థానిక భువనేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామునే పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. శివలింగాన్ని వెన్నతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే షిరిడీసాయి బాబా ఆలయం, చల్లాటమ్మ ఆలయం, సీతారామ ఆంజనేయస్వామి ఆలయం, చిన్నమాంబట్టు కాశీవిశ్వేశ్వర ఆలయం, పన్నంగాడు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించారు. బంగారు చీర అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు జరిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.







కోట: ప్రత్యేక అలంకారంలో కోటమ్మ - చిల్లకూరు: బంగారుచీరలో ముత్యాలమ్మ - తడ: వెన్న అలంకారంలో మహాశివలింగం

కల్యాణ్‌రెడ్డికి సత్కారం



కల్యాణ్‌రెడ్డిని సత్కరిస్తున్న యువకులు

పెళ్లకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామంలో కేఆర్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ వేలూరు కల్యాణ్‌రెడ్డి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కల్యాణ్‌రెడ్డిని గ్రామానికి చెందిన యువకులు సత్కరించారు. కార్యక్రమంలో కుంపటి సిసింద్రీ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణం నార్త్ గిరిజన కాలనీ, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీల్లోని 70 మంది నిరుపేదలకు సారంగం విజయశంకర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సారంగం రమేష్‌బాబు, బీజేపీ నాయకులు వాసు, అంబరీషా, శరత్ చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

సత్ప్రవర్తనతో మెలగాలి



డీఎస్పీ రమణకుమార్‌తో సీఐలు, ఎస్ఐలు

గూడూరు అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరు సత్ప్రవర్తనతో మెలిగి శాంతయుత జీవితాన్ని గడపాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, గోపాల్, సురేష్‌బాబు, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

కళాశాలకు వంట సామగ్రి వితరణ

సూళ్లూరుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త ఏడాది నుంచి జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగప్రసాద్ దంపతుల సహకారంతో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులతో పాటు వంట పాత్రలను ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, దంతాల రవి, ఆరణి చంద్రమోహన్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు వంట సామగ్రి అందజేస్తున్న కొండేపాటి గంగాప్రసాద్ దంపతులు, టీడీపీ నాయకుడు రమేష్ తదితరులు

2025లో నా ప్రాధాన్యాలు

కొరిడి, పేర్నాడు రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్యే విజయశ్రీ

కొరిడి, పేర్నాడు రోడ్డు సమస్యకు పరిష్కారం



1 పులికాట్ తీర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కోసం దశాబ్దాలుగా అక్కడి ప్రజలు పోరాడుతున్నారు. పులికాట్ సరస్సు వన్యప్రాణి విభాగం పరిధిలో ఉండడంతో రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడంలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరించా. కొరిడి, పేర్నాడు గ్రామాలకు ఏడాదిలోగా శాశ్వత రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తా.

కాళంగి గ్రాయిన్ నిర్మాణం

2 కాళంగినది, పులికాట్ సరస్సు కలిసేచోట గ్రాయిన్ నిర్మించాలని దశాబ్దకాలంగా స్థానికులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం 2018లో శాశ్వత నిర్మాణం కోసం రూ.3.38 కోట్లు కేటాయించగా, తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించాం. ఏడాదిలోగా పనులు పూర్తి చేయిస్తానని విజయశ్రీ తెలిపారు.

చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చడం

3 చెంబేడు చెరువు కింద సుమారు 15వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ చెరువును ఆధునికీకరించి మినీ రిజర్వాయర్‌గా మార్చితే రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇందుకోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపాం. అనుమతి రాగానే పనులు చేపడతాం.

భక్తులతో పోటెత్తిన పెంచలకోన



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి వున్న భక్తులు

రాపూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెంచలస్వామి నామస్మరణలతో పెంచలకోన క్షేత్రం మార్మోగింది. కొత్త సంవత్సరం వేళ తమ ఇష్టదైవాన్ని దర్శనం చేసుకునేందుకు నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులుతీరి స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం గుడి ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలో తూమాయి వద్ద ఉన్న అంకయ్య కొండ గుడి వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి క్యాలెండరును ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులను ఆ పార్టీ నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు.

కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడదాం: సీపీఎం



కరపత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ఉంటూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడదామని సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే దిశగా సీపీఎం పాటు పడుతుందని తెలియజేస్తూ పలు కూడళ్లలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపలోపలే మతం, గడపదాటితే అందరం భారతీయ సోదరులుగా ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్ ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.